క్లుప్తంగా

వరద బాధితులకు ఆర్థికసాయం

తాడేపల్లిరూరల్: ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా వరదలు బీభత్సం సృష్టించడంతో పలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. వారిని ఆదుకునేందుకు సీపీఐ గుంటూరు జిల్లా శాఖ పిలుపునివ్వడంతో స్పందించిన తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం జెడ్పీ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు కాకుమాను జోజప్ప మంగళవారం తన వంతు సహాయాన్ని అందజేశారు. మంగళగిరి ఏరియా సీపీఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్యకు రూ.10 వేలు అందజేశారు. జోజప్ప మాస్టర్‌ను పలువురు అభినందించారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



మంగళగిరి: విశ్వకర్మ జయంతిని పట్టణంలోని పలు సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కేశన శంకరరావు, పారేపల్లి మహేష్, కుమ్మరి క్రాంతి కుమార్, ఉప్పాల రాజ్‌కిరణ్, ఉడతా శ్రీనివాసరావు, కొమ్మకుల విజయభాస్కరావు, ఆలా శివాజీ తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీ నరసింహ స్వర్ణకార సంక్షేమ సంఘం ఆధ్వరంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు జగ్గారపు రామోహన్‌రావు, మంద్రు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం



తాడికొండ: నైట్‌హాల్ట్‌లో ఆగిన ఆర్టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేసిన ఘటన తాడికొండ మండలం ముక్కామల గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాల ప్రకారం ముక్కామలకు చెందినవారు మనుషులు ఎక్కకుండానే గుంటూరులో బస్సు బయలుదేరే సమయంలో లగేజీ వేశారు. అయితే గ్రామంలో ఆ లగేజీ దించుకొంటుండగా.. ఇలా అయితే మా ఉద్యోగాలకు ఇబ్బంది.. మనుషులు ఎక్కకుండా లగేజీ ఎందుకు వేశారు అని కండక్టర్ ప్రశ్నించడంతో ఆవేశానికి గురైన సుధాకర్ అనే వ్యక్తి బస్సు అద్దాలు పగలగొట్టి పారిపోయాడు. దీనిపై బస్సు డ్రైవర్, కండక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించి కేసు నమోదు చేయనున్నట్లు సీఐ వాసు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం



వల్లభాపురం(కొల్లిపర): రైతులు ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తే, తక్కువ పెట్టుబడితో పాటు అధిక దిగుబడులు సాధించటమే కాకుండా ఆహార ధాన్యాలు ఎంతో ఆరోగ్యకరంగా ఉంటాయని వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విద్యార్థినులు రైతులకు వివరించారు. వ్యవసాయ, ఉద్యాన విజ్ఞాన విభాగం ద్వారా 2024–25 గ్రామీణ అవగాహన అనుభవ కార్యక్రమంలో భాగంగా విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విద్యార్థులు మంగళవారం మండలంలోని వల్లభాపురంలోని రైతులకు మొక్కల పెంపకానికి సహజ పద్ధతులు, ధ్రువ జీవామృతం తయారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట సాగు చేయడం వలన రసాయనాల వాడకం ఉండదని చెప్పారు. జీవామృతం కషాయాలపై రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వివిధ పంటలో చీడపీడల నివారణకు జీవామృతం వినియోగించాలని సూచించారు. ధ్రువ జీవామృతం పంటల్లో జీవన ఎరువుగా వాడాలని చెప్పారు. జీవామృతాన్ని పాలు, పెరుగు, వేరుశనగ, గోవు మూత్రం వంటి సహజ పదార్థాలతో రైతులు తమ ఇంటి వద్దనే ఏ విధంగా తయారు చేసుకోవాలని అన్న విషయాలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం 4వ సంవత్సరం విద్యార్థినులు ఎస్.కావ్య శ్రీ, బీవీఎస్ కావ్య, బి.నక్షత్ర, ఎ.మధులత, ఎం.లోకేశ్వరి, వై.శ్రీహిత, అజ్మీరా, జమేరియా, ఎల్.హేమ, వి.తేజశ్రీ, రైతులు అద్దంకి వెంకటరమణ, నాగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్త దాతకు సర్టిఫికెట్ అందజేత

తెనాలిఅర్బన్: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని తెనాలి జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం సత్యం శివం సుందరం సామాజిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ 60వ సారి రక్తదానం చేశారు. అతడిని బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధ అభినందించి సర్టిఫికెట్ అందజేశారు.

లక్ష్యం.. స్వచ్ఛ నగరం

స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో నగర కమిషనర్ అలీంబాషా



మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు, ప్రజలు

మంగళగిరి: ఎంటీఎంసీను పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంటీఎంసీ ఆధ్వర్యంలో నగరపరిధిలోని ఎన్‌ఆర్‌ఐ జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్ధయ్యలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాల రూపకల్పనకు కృషి..

ఫిరంగిపురం: స్వచ్ఛ గ్రామాల రూపకల్పనకు అధికారులు, నాయకులు కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ నిర్మల లక్ష్మీకుమారి అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచులు, కార్యదర్శులు, నోడల్ అధికారులకు పంచాయతీలలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన నిర్వహించారు. నేటినుంచి అక్టోబర్ 2వరకు నిర్వహించాల్సిన కార్యక్రమాలు వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

- మండలంలోని వేమవరం గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పరిసరాల శుభ్రత గురించి వివరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల గ్రామంలో మంగళవారం నోడల్ ఆఫీసర్ కుసుమ శ్రీదేవి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దుగ్గిరాల ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ బజీన్‌తో పాటు, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, దుగ్గిరాల సర్పంచ్ బాణావత్ ఖుషీబాయి దుగ్గిరాల గ్రామంలో పలుచోట్ల మొక్కలు నాటారు. జడ్పీటీసీ మేకతోటి అరుణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి గ్రామంలోనూ స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమ ఉద్దేశం రోడ్లు శుభ్రం చేయడంతో పాటు చెత్త కుప్పలను తొలగించడం, మురికి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవడం, ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది, గ్రామ పంచాయితీ సిబ్బందితో వెళ్లి దోమల నివారణకు ఫాగింగ్ మరియు యాంటీ లార్వల్ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు ఈ స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సాయిచైతన్య, దుగ్గిరాల–1 ఎంపీటీసీ జాలీబాయి, వివిధ గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దుగ్గిరాలలో ఎంపీపీ షేక్ బజీన్‌తో కలసి మొక్క నాటుతున్న జెడ్పీటీసీ అరుణ, సర్పంచ్ ఖుషీబాయి

భై భై గణేశా..!

- ముగిసిన వినాయక నిమజ్జనం
- దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం



నిమజ్జనానికి తరలిన వినాయక విగ్రహం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి సెంటర్ రెడ్ల రామమందిరం వద్ద గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనం మంగళవారం ఉదయం 10 గంటల వరకు కొనసాగింది. సోమవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన నిమజ్జన మహోత్సవం ఉండవల్లి పురవీధుల్లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంతో పాటు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సినీ నటుడు మహేష్‌బాబు చిత్రపటాలతో యువకులు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. విఘ్నేశ్వరునికి జేజేలు పలుకుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రికార్డు మాటలను వినిపిస్తూ, వైఎస్సార్ సీపీ ప్రచార పాటలకు నృత్యాలు వేశారు. ఉండవల్లి రెడ్ల రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర విగ్రహ దాత, అన్నసంతర్పణ దాత మేకల ఆంజనేయులు కుమారులు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ మాజీ సభ్యులు మేకల హనుమంతరావు, మేకల ప్రసాద్, మేకల సంజయ్ కుటుంబ సభ్యులతో పాటు లడ్డూ దాత అయిన బత్తుల ఏడుకొండలకు మరియు ప్రతిరోజు 150 మంది వరకు భోజనాలతో పాటు ప్రసాదాలు అందజేసిన ప్రతి ఒక్క భక్తునికి కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.



ఉండవల్లి సెంటర్‌లో దివంగతనేత వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న యువకులు

ఇరుకు రోడ్డులో అడ్డుగా బల్లలు

- పావురాల కాలనీలో ఇళ్లకు అడ్డంగా టీడీపీకి చెందిన సిట్టింగ్ బల్లలు ఏర్పాటు
- చిన్న సందుల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు అని స్థానికులు మొత్తుకున్నా వినని టీడీపీ కార్యకర్త



మంగళగిరి పావురాల కాలనీలో ఇళ్ల ముందు, ఇరుకురోడ్డులో వేస్తున్న బల్లలు

మంగళగిరి: పట్టణంలోని పావురాల కాలనీలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త రామారావు దౌర్జన్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం టీడీపీకి చెందిన బల్లలను కాలనీలోని రోడ్డులో ఇతరుల ఇళ్ల ముందు వేయడంతో వారు ఎలా నడవాలంటూ రామారావును ప్రశ్నించారు. దీంతో తాము అక్కడే వేస్తామని ఎలా ఆపుతారో చూస్తానంటూ బదులిచ్చాడు. అసలే కాలనీలో ఇరుకు రోడ్లని, రెండు బండ్లు ఎదురెదురుగా వస్తే వెళ్లలేని దుస్థితి నెలకొందని, ఈ పరిస్థితిలో రోడ్డుపై బల్లలు వేస్తే మరింత ఇరుగ్గా మారతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల ముందు కాకుండా ఏదైనా విశాలమైన ప్రాంతంలో బల్లలు వేయాలని సూచించినా సదరు టీడీపీ కార్యకర్త ససేమిరా అనడంతో చేసేదేమి లేక మిన్నకుండిపోయారు. అధికారులు కల్పించుకుని బల్లలు తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న రఘురామయ్య డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలోని డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య కార్యకర్త మాలతి నులిపురుగుల కారణంగా వచ్చే రోగాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తమ్మా రాఘవరెడ్డి, పూర్ణచంద్రరావు, సరళాదేవి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి బి.రాంబాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో...

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోను, దుగ్గిరాల మండల పరిధిలోను ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలో కుంచనపల్లి, సీతానగరం, డోలాస్‌నగర్‌లో వున్న ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు 1 నుంచి 19 సంవత్సరాల లోపు వున్న వారికి నులిపురుగుల నివారణ టాబ్లెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ 1 నుంచి 2 సంవత్సరాల లోపు పిల్లలకు సగం మాత్ర నీళ్లలో కలిపి ఇచ్చామని, 3 నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు నోటి ద్వారా మాత్రలు అందజేశామన్నారు. తాడేపల్లి, సీతానగరం, కుంచనపల్లి, దుగ్గిరాల, ఈమని ప్రభుత్వ వైద్యులతో పాటు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు అందించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఫిరంగిపురం, నుదురుపాడు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత వారిచే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఆరోగ్యసిబ్బంది ఆల్‌బెండాజోల్ మాత్రలు మింగించారని చెప్పారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు



రైతు భరోసా కేంద్రం అధికారి శాంతిశ్రీకి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: ఇటీవల కురిసిన అధికవర్షాల కారణంగా పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు అన్నారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో రైతు, కౌలు రైతు సంఘం నాయకులతో కలసి రైతు భరోసా కేంద్రం అధికారి శాంతిశ్రీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జొన్న శివశంకరరావు మాట్లాడుతూ ఆగస్టు నెల చివరిలో కురిసిన అధిక వర్షాలకు చిర్రావూరు గ్రామంలోని రైతులు, కౌలు రైతులు, పాడిరైతులు విపరీతంగా నష్టపోయారని అన్నారు. చిర్రావూరు గ్రామానికి చెందిన 10 పాడి పశువులు కృష్ణానది వరదలలో కొట్టుకుపోయాయని అన్నారు. లంక పొలాల్లో సుమారు 25 ఎకరాల్లో డ్రిప్ పైపులు పనికిరాకుండా పాడయ్యాయని అన్నారు. పంట నష్టపోయిన రైతులకు పసుపు, కూరగాయ పంటలకు ఎకరానికి రూ.25 వేలు, కంద పంటకు ఎకరానికి రూ.లక్ష, పాడైపోయిన డ్రిప్ పైపుల రైతులకు కొత్త డ్రిప్ పైపులను ప్రభుత్వం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మేడూరి పాములు, శంకర్, కౌలు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై మంత్రి నారా లోకేష్‌కు వినతులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసం ఐటీ శాఖ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉండవల్లిలోని అమరావతి కరకట్ట వెంబడి ఆయన నివాసంలో మంగళవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల సంభవించిన వరదతో తమ ఇళ్లు నీటమునిగాయని, ఎలక్ట్రానిక్ వస్తువులు ధ్వంసమయ్యాయని ఉండవల్లికి చెందిన సిహెచ్ శ్రీనివాసరావు, ఎ.సుబ్రహ్మణ్యం, వెంకటరావు, సైదులు వినతిపత్రాన్ని అందజేశారు. నష్టపరిహారం అందించడంతో పాటు ఎలక్ట్రికల్ వస్తువుల మరమ్మతుల కోసం విజయవాడలో వలే గుంటూరు జిల్లాలో ఉచిత సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

- మంగళగిరికి చెందిన రవికిరణ్, కుమార్, నాగసాయి, పశ్చిమబెంగాల్‌కు చెందిన బంగారు ఆభరణాలు తయారు చేసే గోపీ అనే వ్యక్తి తమ వద్ద నుంచి 630 గ్రాముల బంగారం తీసుకుని పరారయ్యాడని, గోపీని పట్టుకుని తమకు బంగారం అందజేయాలని అర్జీ అందజేశారు.
- మంగళగిరికి చెందిన దరియాబి అనే మహిళ మంగళగిరి ఆటోనగర్‌లో తన కుటుంబానికి చెందిన రూ.5 లక్షల విలువైన స్థలాన్ని గతంలో నగదు అవసరం ఉండి పటాన్ ఆలీబాషీ, పటాన్ అశోక్‌కు తాకట్టు పెట్టామని, ఇప్పుడు నగదు చెల్లించినా మా స్థలం మాకు ఇవ్వకుండా ఫోర్జరీ సంతకాలతో ఆ స్థలాన్ని వేరేవారికి అమ్మివేశారని, మా స్థలాన్ని మాకు అప్పజెప్పాలని కోరుతు వినతి పత్రం అందజేశారు.
- ఎయిమ్స్ హాస్పిటల్ నుంచి రాకపోకలు కల్పించాలని జనసేన పార్టీ నాయకులు మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రం సమర్పించగా, ఆయా సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.

దేశం గర్వించదగిన మహనీయుడు విశ్వేశ్వరయ్య

చలపతిలో ఘనంగా ఇంజినీర్స్‌డే వేడుకలు



తాడికొండ: దేశం గర్వించదగిన గొప్ప ఇంజినీర్ దార్శనికుడు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నాగ శ్రీనివాసరావు అన్నారు. విశ్వేశ్వరయ్య జన్మదినం సందర్భంగా ఇంజినీర్స్ డేను పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలకు ఉపయోగపడే విధంగా నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా ఆవిష్కరణలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీన్‌లు ఫణికుమార్, సుబ్బారావు, బాలమురళీ కృష్ణ, నాగ రవికిరణ్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయకృష్ణ వివిధ విభాగాధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న యువకుల అరెస్ట్

తెనాలిరూరల్: వరస చోరీలకు పాల్పడుతున్న యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో చోరీ కేసుల వివరాలను ఎస్ఐ షేక్ కరిముల్లా వివరించారు. వేర్వేరు కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి వీరి వద్ద నుంచి రూ. 2.80 లక్షల విలువ చేసే 45గ్రాముల బంగారం ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టణానికి చెందిన ఒడగల పార్థసారథి అలియాస్ పార్థు చోరీలు చేస్తుంటాడు. తన స్నేహితులు కూరపాటి సంపత్, ధనావత్ హనుమనాయక్‌లతో కలసి ఇటీవలి కాలంలో చోరీలకు పాల్పడుతున్నాడు. పట్టణ చినరావూరుకు చెందిన వెంకటవాసు జూలై 11వ తేదీన అర్ధరాత్రి సమయంలో బహిర్భూమికని బయటకు రాగా అతడిని బెదిరించి మెడలో ఉన్న రెండు బంగారు గొలుసులు, చేతికి ఉన్న రెండు ఉంగరాలను నిందితులు చోరీ చేసినట్లు తెలిపారు. అలానే నాజరుపేటకు చెందిన కాంతి శ్రీరామ్ ఇంట్లో నిద్రిస్తుండగా లోనికి ప్రవేశించిన వీరు బీరువాలో ఉన్న రెండు బుట్ట పోగులు అపహరించుకెళ్లారు. చెంచుపేట కౌపెన్ యర్రంనేని విజయప్రసాద్ బజారులో వృద్ధురాలి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఆయా ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులను బుర్రిపాలెం రోడ్డులోని పాలాద్రి కాలువ వద్ద అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కరిముల్లా తెలిపారు.

రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న దుగ్గిరాల వ్యవసాయ అధికారిణి పి.శిరీష

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రైతులు ప్రతి ఒక్కరు ఈ–కేవైసీ చేయించుకోవాలని దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారి పి.శిరీష అన్నారు. మంగళవారం దుగ్గిరాల గ్రామంలో ఈ–కేవైసీపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలో పంట నమోదు చేసుకున్న ప్రతి ఒక్క రైతు తప్పని సరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని, ఈ–కేవైసీతోనే పంట నమోదు ప్రక్రియ పూర్తి అవుతుందని, కాబట్టి ప్రతి ఒక్క రైతు సంబంధిత రైతు సేవా కేంద్రాల వద్దకు ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకు వెళ్లి ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 23వ తేదీతో గడువు ముగుస్తుందని ఆమె వివరించారు.

హెచ్ఐవీ నివారణ, అవగాహనపై మినీకథల పోటీలు



మాట్లాడుతున్న లక్కంరాజు సునీతారాజు

తాడేపల్లిరూరల్: హెచ్ఐవీ వైరస్ నివారణపై అవగాహన మినీ కథల (తెలుగు) పోటీలను నిర్వహిస్తున్నట్లు మారుతీ మహిళా సొసైటీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లక్కంరాజు సునీతారాజు అన్నారు. మంగళవారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ వైరస్ నివారణపై అవగాహన మినీ కథల పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు మారుతీ మహిళా సొసైటీ స్వచ్ఛంద సంస్థ తరపున ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు, మరియు మూడు ప్రోత్సాహక బహుమతులు ఒక్కొక్కరికి రూ. 1,116లు మరియు ప్రశంసా పత్రాన్ని అందజేస్తామని తెలిపారు. పోటీలలో పాల్గొనే రచయితలు ఏ4 రెండు పేజీలు రాత ప్రతి మించకుండా ఈ పోటీ కోసమే రాసిన కథను తమ పూర్తి చిరునామా, మొబైల్ నెంబర్ తెలుపుతూ అక్టోబర్ 30వ తేదీ లోపు లక్కంరాజు సునీతారాజు, డైరెక్టర్, మారుతీ మహిళా సొసైటీ, నులకపేట, తాడేపల్లి, గుంటూరు జిల్లా అడ్రస్‌కు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 9573939766 నెంబరులో సంప్రదించాలన్నారు. పోటీ ఫలితాలను నవంబర్ 23వ తేదీన ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు మేనేజర్ పి.గంగాభవాని, ఇ.ప్రత్యూష, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేకాటాడుతున్న 8 మంది అరెస్ట్

కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో పొలాల్లో ఒక భవనంలో రహస్యంగా పేకాటాడుతున్న 8 మందిని ఎస్ఐ పి.కోటేశ్వరరావు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాటాడుతున్న 8 మంది వద్ద నుంచి రూ.15,220, 4 మోటార్ సైకిల్‌లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వెంట నాగరాజు, తాతారావు ఉన్నారు.

సినిమాపై కేబినెట్‌లో చర్చించటం అవసరం

- సబ్సిడీ పెంపుదల చేయాలి
- చలనచిత్ర అభివృద్ధి సంస్థను సాంస్కృతిక శాఖలో విలీనం చేయాలి
- మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా

తెనాలి: రాష్ట్ర కేబినెట్ బుధవారం సమావేశమవుతున్న సందర్భంగా సినిమా పరిశ్రమపై ప్రతిపాదిత అంశాలపై చర్చించాల్సిందిగా మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. స్థానిక 'మా–ఏపీ' కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సినిమా పరిశ్రమ ఏపీలో అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థను సమాచారశాఖ నుంచి విడదీసి పర్యాటక, సాంస్కృతిక శాఖల్లో విలీనం చేస్తే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడ్డారు. సినిమా షూటింగ్ లోకేషన్లన్నీ టూరిజం శాఖ పరిధిలోనే ఉన్నందున అనుమతులకు కాలయాపన జరగదన్నారు. గతంలో ప్రకటించిన నంది అవార్డులను అందజేస్తూ ప్రస్తుత కాలానికి నంది అవార్డులను ప్రకటించాలని కోరారు. రాజకీయాలతో సంబంధంలేని వ్యక్తులను న్యాయనిర్ణేతల కమిటీలో నియమించాలని సూచించారు. కొన్ని రాష్ట్రాల్లో సబ్సిడీ రూ.50 లక్షలు చెల్లిస్తున్న నేపథ్యంలో పెరిగిన సినిమా నిర్మాణ వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆంధ్రలో సబ్సిడీని రూ.10 లక్షల్నుంచి రూ.50 లక్షలకు పెంచే దిశగా నిర్ణయం తీసుకోవాలని యూనియన్ తరపున కోరారు. స్టూడియోల నిర్మాణం, పోస్ట్ ప్రొడక్షన్ యూనిట్ల ఏర్పాటుపైనా ఆలోచన చేయాలన్నారు. పర్యాటక, సాంస్కృతిక, ఎఫ్‌డీసీ శాఖల్లో ఖాళీలను భర్తీచేయాలని కోరారు.

పెరియార్ చిరస్మరణీయుడు

తెనాలి: దేశంలో అణగారిన వర్గాల ప్రజలు ఆత్మగౌరవంతో జీవించేలా కృషి చేసిన పెరియార్ ఈవీ రామస్వామి నాయకర్ ప్రాతఃస్మరణీయుడుగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కొనియాడారు. పెరియార్ జయంతిని పురస్కరించుకుని బుధవారం పెరియార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను అధ్యక్షత వహించారు. పెరియార్ జీవిత విశేషాలను, అణగారిన వర్గాలకు చేసిన సేవలను స్మరించుకున్నారు.